## కబ్జాకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కాశీబుగ్గ, డిసెంబర్ 30: నగరంలోని కాశీబుగ్గ నర్సంపేట రోడ్డులో ఉన్న అజాంజాహి మిల్లు కార్మికుల యూనియన్ భవనాన్ని కబ్జా చేసిన వారితోపాటు సహకరించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అజాంజాహి మిల్లు రిటైర్డ్ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ భవనం కూల్చేసిన స్థలంలో మిల్లు రిటైర్డ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భవనం కూల్చేసిన కాసం పుల్లయ్య యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకునే వరకు మరిన్ని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

## మహిళలు హక్కులు పొందినప్పుడే అభివృద్ధి సాధ్యం

సంగెం, డిసెంబర్ 30: మహిళలు హక్కులు పొందినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని సర్వోదయ యూత్ ఆర్గనైజింగ్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఇందిర అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మహిళ సహాయత కమిటీ సభ్యులకు సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కోఆర్డినేటర్ ఇందిర మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. చట్టాల అమలు, సత్వర న్యాయం మహిళను పురోగతి వైపు నడిపిస్తుందన్నారు. లీగల్ కౌన్సిలర్ శోభారాణి, రాధిక, సంధ్య, భద్రమ్మ పాల్గొన్నారు.

## న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమించొద్దు

నెక్కొండ/రాయపర్తి, డిసెంబర్ 30: న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమించొద్దని నెక్కొండ ఎస్సై మహేందర్, రాయపర్తి ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్ సూచించారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, ర్యాష్‌డ్రైవ్ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్లపై డీజేలు పెట్టొద్దని, పటాకులు కాల్చడం, కేక్‌లు కట్ చేయొద్దన్నారు.

**ప్రకటన**

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియనేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన శ్రీమతి కర్ర పద్మ భర్త: కీ.శే. సుధాకర్ రెడ్డి, నివాసము: ఇ.నెం. 1-16, దమ్మక్కపేట, హుజురాబాద్, కరీంనగర్ జిల్లా వారు మెడికవర్ హాస్పటల్ ఎదురు సందు రోడ్, హంటర్ రోడ్, హనుమకొండ జిల్లా ఓపన్ ప్లాట్ నెం.3, సర్వేనెం. 176, 177 లో విస్తీర్ణంలో 275.61 గజములు దాక్యుమెంట్ నెం. 2775/2020 (బుక్ 84/1988, 1404/ 1969) గల దాని యజమానులైన శ్రీ పల్లెపాటి వెంకటేశ్వర్ రావు, తండ్రి కీ.శే. రంగారావు, నివాసం: ఇ.నెం. 1-8-417, బాలసముద్రం, హనుమకొండ జిల్లా గారి ప్లాటుకు అగ్రిమెంట్ హోల్డర్ అయిన విశాల్ భంగ్, తండ్రి: రాంచిలాస్ భంగ్, నివాసము ఇ.నెం.80/బి , రాంకీ విల్లా, వరంగల్ సిటీ మరియు జిల్లా గారి నుండి కొనుగోలు చేయుటకు విక్రయ అగ్రిమెంట్ ఏర్పరుచుకొని, కొంత మొత్తం బయానాగా ఇవ్వడమైనది. కావున ఇట్టి ఆస్తి అనగా ఈ దిగువ చూపిన షెడ్యూల్ దాఖాలాగల ఆస్తి విషయమై ఎవ్వరికి ఏలాంటి ఆక్షేపణలు, క్లయిములు మరియు అభ్యంతరములుగాని ఉన్నచో తగిన సాక్షాధారములతో వారం (7) రోజుల లోపు ఈ దిగువ అడ్రసుకు తెలియజేయగలరు. లేనిచో ఇందు షెడ్యూలు దాఖాలా ఆస్తిపై ఎవరికి ఏలాంటి ఆక్షేపణలు, క్లయిములు మరియు, అభ్యంతరములు లేవని తలచి మిగత రూపాయలు చెల్లించి నా క్లయింట్ రిజిస్ట్రేషన్ చేయించుకోగలరు

**షెడ్యూలు** ఓపన్ ప్లాట్ నెం. 3, సర్వేనెం. 176, 177లో విస్తీర్ణం 275.61 చ .గజములు, మెడికవర్ హాస్పటల్ ఎదురు సందు రోడ్, హంటర్ రోడ్, హనుమకొండ జిల్లా హద్దులు: తూర్పు: వై.మంజుల అండ ఆదర్స్ ఇ.నెం.23-6-132 పడమర: 30 ఫీట్ల రోడ్ ఉత్తరం: ఎర్రం నాగరాజు ఇ.నెం. 23-6-131/2/1 ప్లాట్ నెం.2 దక్షణం: కడవేరు అనూష ఇ.నెం. 23-6-131/2/1/ఎ/1 ప్లాట్ నెం.4.

తేది.30.12 2024

సం/- (సి. హెచ్.మల్లా రెడ్డి) న్యాయవాది
ఇంటి నం. 1-7-1266, ఆడ్వకేట్స్ కాలనీ,
హన్మకొండ సెల్: 9849747180.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOTS FOR SALE**

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎల్క్ట్రిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.

NT-326623

**WANTED**

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.

NT-338992-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# 'ప్రజావాణి'కి 122 దరఖాస్తులు

- ఇందిరమ్మ ఇళ్ల సర్వే త్వరగా పూర్తి చేయాలి
- కలెక్టర్ సత్యశారద

ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, డిసెంబర్ 30: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 122 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూశాఖకు చెందినవి 36, జడ్పీ 18, వరంగల్ కలెక్టరేట్ 10, జీడబ్ల్యూఎంసీ 8, డీఆర్డీవో 6, లీడ్ బ్యాంక్ మేనేజర్ 5, వైద్య ఆరోగ్యశాఖ 5, పోలీస్‌శాఖ 4, ఇతర సమస్యలపై 16 దరఖాస్తులు వచ్చాయి. ఖిలావరంగల్ మండలం ఉర్సు శివారు 355 సర్వే నంబర్‌లోని ప్రభుత్వభూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సంగీ ఎలేందర్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ భూమిని మరోసారి సర్వే చేసి హద్దులు, బోర్డులు ఏర్పాటు చేయాలని, కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పుట్టుకతో మరుగుజ్జు అయిన తనకు సదరం సర్టిఫికెట్‌ను తిరస్కరిస్తున్నారని ఓ బాలిక తన తల్లితో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాగా, స్వీకరించిన దరఖాస్తులను కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రగతిపై ఏర్పాటు చేసిన సమీక్షలో మాట్లాడారు. అర్హులకు లబ్ధి చేకూరేలా మొబైల్ యాప్ ద్వారా సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పీఎం ఆవాస్ యాప్‌లో సర్వేయర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి తప్పిదాలకు తావులేకుండా నమోదు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి పాల్గొన్నారు.

కాశీబుగ్గ: ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్లు ఓని భాస్కర్, బయ్యా స్వామి



గిర్మాజీపేట: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ కల్పన

## క్యాలెండర్ల ఆవిష్కరణ

గిర్మాజీపేట/కాశీబుగ్గ, డిసెంబర్ 30: నూతన సంవత్సరం-2025 క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించారు. 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన ఫ్రెండ్స్ యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను పిన్నవారివీధిలోని తన ఇంటి ఆవరణలో ఆవిష్కరించారు. గందె నవీన్, కొత్తపల్లి రాజేశ్, రామిని కృష్ణ, సుమన్, దామోదర్, కళ్యాణ్, అఖిల్, సత్యనారాయణ, పాండే, కిట్టు, మారుతి, శ్రీకాంత్, పవన్, లోకేశ్, శివ, రాము, నారాయణ పాల్గొన్నారు. కాశీబుగ్గ వివేకానందకాలనీలోని విశ్వకర్మ సహకార పరపతి సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. మాజీ కార్పొరేటర్లు ఓని భాస్కర్, బయ్యా స్వామి మాట్లాడారు. ట్రస్ట్ సభ్యులు పోలోజు శంకరయ్య, మాజోజు శ్రీనివాస్, పొల్లేటి రాఘవాచారి, సిద్దోజు వీరబ్రహ్మం, ఉప్పు నూతల పుల్లాచారి, నారాయణ, కర్ణకంటి శ్రీనివాస్, మాడేబోజు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ధర్నా

ఖిలావరంగల్, డిసెంబర్ 30: గుడిసెవాసులందరికీ పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సోమవారం ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు నలిగంటి రత్నమాల మాట్లాడుతూ మండలంలో సుమారు 6వేల మంది గుడిసెవాసులు దశాబ్దాలుగా ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు నిర్మిస్తామని చేసిన వాగ్దానాలు నీటి మూటలుగా మారాయని విమర్శించారు. ధర్మారపు సాంబమూర్తి, బాబు, ప్రశాంత్, ఉదయ్, భవాణి, మల్లన్న, సమీనా, జరీనా పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, గుడిసెవాసులు

## చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

పృథ్వీకిరణ్ (ఫైల్)

ఖిలావరంగల్/ కాశీబుగ్గ, డిసెంబర్ 30: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ యువకుడు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మిల్స్‌కాలనీ సీఐ జే వెంకటరత్నం తెలిపిన కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్‌కు చెందిన ముశం పృథ్వీకిరణ్(30) దేశాయిపేటలో నివసిస్తూ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 26న రాత్రి డ్యూటీ ముగించుకొని బైక్‌పై ఓ సిటీ ఎస్సార్ నగర్‌లోని అత్తింటికి బయల్దేరాడు. రాత్రి 10 గంటల సమయంలో ఓ సిటీ సమీపంలో కుక్కలు బైక్‌కు ఎదురుగారాగా తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు డివైడర్‌కు ఢీకొట్టి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కాగా స్థానికులు ఎంజీఎం దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హనుమకొండలో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తండ్రి తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య నళిని, పాప, బాబు ఉన్నారు.

## అంతర్జాతీయ వాకర్స్ అసోసియేషన్ రీజియన్ కౌన్సిలర్‌గా సారంగపాణి

పోచమ్మమైదాన్, డిసెంబర్ 30: అంతర్జాతీయ వాకర్స్ అసోసియేషన్‌లోని 18 జిల్లాల రీజియన్ కౌన్సిలర్‌గా వరంగల్ నవయుగ కాలనీకి చెందిన చింతం సారంగపాణి ఎంపిక చేశారు. ఏపీలోని ఏలూరులో రెండు రోజుల పాటు అంతర్జాతీయ వాకర్స్ 33వ సమావేశం నిర్వహించారు. తన పరిధిలో చేపడుతున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు, వాకర్స్ సంఘాలు ఏర్పాటుకు చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవకాశం కల్పించినట్లు చెప్పారు. అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షుడు ఎం మురళీమోహన్ నియామకపత్రం అందజేశారు. వాకర్స్ మాజీ అధ్యక్షురాలు ప్రభావతి ప్రమాణ స్వీకారం చేయించారు. తన ఎంపికకు సహకరించిన ఏరియా అధ్యక్షుడు తడక కుమారస్వామి, గవర్నర్ ఎల్లాగౌడ్, పుల్లూరు శ్రీనివాస్, రాంచందర్, భారతికి కృతజ్ఞతలు తెలిపారు.

## అయ్యప్ప భక్త మండలికి వంటపాత్రలు అందజేత

రాయపర్తి, డిసెంబర్ 30: మండలంలోని మైలారంలో అయ్యప్ప భక్త మండలికి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ఎస్ ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి వంటపాత్రలు ఉచితంగా అందజేశారు. మహేందర్‌రెడ్డి, పట్టాపురం భిక్షపతి పాల్గొన్నారు. కాగా, తొర్రూరు మండలం చెర్లపాలెంకు చెందిన ప్రవీణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానాల్లో చికిత్స పొంది ఇంటికి రాగా, శ్రీనివాస్‌రెడ్డి అనుచరులతో కలిసి పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందించారు. బీఆర్ఎస్ మండల నాయకులు రంగు కుమార్, భూక్యా సురేందర్‌రాథోడ్, లేతాకుల సుధాకర్‌రెడ్డి, పరుపాటి రవీందర్‌రెడ్డి, సంది దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కొత్త టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ఖిలావరంగల్, డిసెంబర్ 30: కొత్త టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీటీవోకు వినతిపత్రం అందజేశారు. వరంగల్, ఖిలావరంగల్ మండలాల పరిధిలో నియమితులైన ఉపాధ్యాయులకు 45రోజులు దాటినా ప్రాన్ నంబర్లు కేటాయించలేదని తెలిపారు. ప్రాన్ నంబర్లు కేటాయించి సత్వరమే జీతాలు చెల్లించాలని, యాక్టివ్‌లో లేని డీడీవో రిజిస్ట్రేషన్ నంబర్లను యాక్టివేట్ చేయడానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. టీచర్లు రాజు, శ్రీకాంత్, జయంతి, మాధవి ఉన్నారు.

## పక్కాగా పారిశుధ్య పనులు

ఖిలావరంగల్, డిసెంబర్ 30: గ్రామాల్లో పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ మిషన్‌పై ఢిల్లీ నుంచి ఎస్‌బీఎం జాయింట్ సెక్రటరీ జితేంద్ర శ్రీవత్సవ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సమగ్ర పారిశుధ్య నిర్వహణలో భాగంగా పంచాయతీల్లో ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్త వేరుచేసి డంపింగ్ షెడ్డుకు తరలిస్తున్నట్లు చెప్పారు. షెడ్డులో చెత్తను ఎరువుగా మార్చుతున్నట్లు పేర్కొన్నారు. డీఆర్డీవో కౌసల్యాదేవి, డీపీవో కల్పన పాల్గొన్నారు.

## రైతు శిక్షణ కేంద్రంలో స్క్రాప్ వేలం

కాశీబుగ్గ, డిసెంబర్ 30: నగరంలోని పైడిపల్లి రైతు శిక్షణా కేంద్రంలోని స్క్రాప్ పరికరాలు, వస్తువులు జనవరి 8న ఉదయం 11.30 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు జిల్లా వ్యవసాయ అధికారి వరంగల్ పేర రూ.2,500 డీడీ తీసి ఆధార్‌కార్డు జిరాక్స్ జత చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వేలంలో దక్కించుకున్న వారు డబ్బులు రెండు రోజుల్లో చెల్లించిన తర్వాతే స్క్రాప్ పరికరకాలు, ఇతర వస్తువులు తీసుకెళ్లేందుకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 7288894714కు సంప్రదించాలని కోరారు.

## ఏఐసీటీయూ కరపత్రాల ఆవిష్కరణ

ఖిలావరంగల్, డిసెంబర్ 30: కార్మిక హక్కుల రక్షణ భవిష్యత్ ఉద్యమాల నిర్మాణాల రూపకల్పన కోసం వచ్చే నెల 5న కేసముద్రంలో నిర్వహించే ఏఐసీటీయూ రాష్ట్ర సర్వసభ్య సమావేశ కరపత్రాలను తూర్పుకోటలో ఆవిష్కరించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్ర ప్రతాప్, జిల్లా ప్రధానకార్యదర్శి సుంచు జగదీశ్వర్, ఇట్టినేని సూరయ్య, ఐతం నాగేశ్, మల్లికార్జున్, నర్సయ్య, ఐలయ్య, రవి, నరహరి పాల్గొన్నారు.

## ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

గీసుగొండ, ఆగస్టు 30: మండలంలోని బొడ్డుచింతలపల్లిలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం జరిగింది. తహసీల్దార్ రియాజుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవలు పొందే హక్కు ఉందని తెలిపారు. కుల మతాలకతీతంగా ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ విజిలెన్స్ కమిటీ సభ్యుడు చిన్నస్వామి పాల్గొన్నారు.

## మున్నూరుకాపు సంఘం కమిటీ ఎన్నిక

కరీమాబాద్, డిసెంబర్ 30: మున్నూరుకాపు పరపతి సంఘం నూతన కమిటీని సోమవారం కరీమాబాద్ లక్ష్మీనగర్‌లో ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా కోల కుమారస్వామి, అధ్యక్షుడిగా చింతపట్ల మురళి, ఉపాధ్యక్షుడిగా వనమాల ప్రహ్లాద్, ప్రధాన కార్యదర్శిగా దద్దనాల రమేశ్, సహాయ కార్యదర్శిగా దద్దనాల రాజేశ్, కోశాధికారిగా నేల్ల రాజు, సహాయ కోశాధికారిగా ఎనబోతుల రవికుమార్, ఆర్గనైజర్లుగా పూజారి హరికృష్ణ, కమటం వేణుగోపాల్, సిరిపురపు అరుణ్, కమిటీ సభ్యులుగా బొల్లం నాగరాజు, గాదె శ్రీనివాస్, కమటం నాగరాజు, బొల్లం రాజ్‌కుమార్, గాదె సంపత్‌కుమార్, రవీందర్, కోటేశ్వర్, రాజ్‌కుమార్, శివకుమార్, మంద సతీష్ ఎన్నికయ్యారు.

## కూచిపూడి నృత్యపోటీల్లో ప్రతిభ

గిర్మాజీపేట, డిసెంబర్ 30: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో కూచిపూడి నృత్యపోటీల్లో వరంగల్ శ్రీనిధి నృత్యాలయం తరపున పాల్గొన్న కొండ్లె రాజశేఖర్ - విశాలి దంపతుల కూతురు స్వేచ్ఛ ప్రతిభ కనబరిచింది. 50ఫీట్ల కూచిపూడి పతాక ఆవిష్కరణలో భాగంగా ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించిన ఈ పోటీల్లో 3వేల మంది నృత్యకారులు పాల్గొనగా ఏడేండ్ల స్వేచ్ఛ ద్వితీయ బహుమతి గెలుచుకుంది. నిర్వాహకులు జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రం అందించి శాలువా కప్పి సత్కరించారు. స్వేచ్ఛను టీచర్ పసుపులేటి సరిత-శ్రీనివాస్ దంపతులతోపాటు పలువురు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వర్ధన్నపేట, డిసెంబర్ 30: మండల కేంద్రం శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై భూక్యా చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భవానీకుంట తండాకు చెందిన నూనావత్ సోములునాయక్(40) వర్ధన్నపేటలో కూరగాయలు కొనుక్కొని ఇంటికి వచ్చేందుకు అంబేద్కర్ సెంటర్‌లో వేచి ఉన్నాడు. తాళ్లకుంట తండాకు చెందిన వాంకుడోతు సురేష్ తన ట్రాక్టర్‌తో డ్రైవ్ చేస్తూ వస్తుండగా ఆపి ఎక్కాడు. వర్ధన్నపేట శివారులో రోడ్డుపై గుంతల కారణంగా సురేష్ సడన్ బ్రేక్ వేయడంతో ఇంజిన్‌పై కూర్చున్న సోములు ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అతడి పైనుంచి ట్రాక్టర్ వెనుక టైర్ వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన సోములును చికిత్స కోసం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య నూనావత్ రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## ఎస్సై శ్రీకాంత్ సేవలు అభినందనీయం

కాశీబుగ్గ, డిసెంబర్ 30: ఎనుమాముల ఎస్సై పోగుల శ్రీకాంత్ సేవలు అభినందనీయమని బీఆర్ఎస్ పార్టీ వర్ధన్నపేట డివిజన్ ఫోరం అధ్యక్షుడు, వరంగల్ పీఏసీఎస్ డైరెక్టర్ నేరెళ్ల రాజు అన్నారు. బదిలీపై వెళ్తున్న ఎస్సైని స్థానికులు సోమవారం 14వ డివిజన్‌లోని ఎస్ఆర్‌నగర్‌లో ఘనంగా సన్మానించారు. రాజుతోపాటు రాష్ట్ర నాయకుడు కేతిరి రాజశేఖర్ మాట్లాడుతూ ఎస్సైగా మూడేళ్లు పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించారని తెలిపారు. స్థానిక నాయకులు పసులాది మల్లయ్య, మచ్చర్ల స్టాలిన్, పున్నం ప్రభాకర్, అంబాల సత్యం, కేతిరి సమ్మక్క, తాళ్లపల్లి రహేళా పాల్గొన్నారు.

## ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి

చెన్నారావుపేట, డిసెంబర్ 30: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సైకాలజిస్ట్ వేలాంగని, కెరీర్ గైడెన్స్ నిపుణుడు రవి అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మోటివేషన్ తరగతులు నిర్వహించారు. వివిధ కెరీర్ అవకాశాలు, ఆయా విద్యా కోర్సులు, పరీక్షల ప్రాముఖ్యత, లక్ష్య సాధనకు అవసరమైన మానసిక సమతుల్యత గురించి వివరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలాజీరావు, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, ఉదయ్‌కుమార్, మాధవి, సతీష్, హంస రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కరీమాబాద్, డిసెంబర్ 30: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలో పలు మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఆయన మాట్లాడుతూ అందరూ తమ ఇళ్ల ఆవరణలో మొక్కలు సంరక్షించాలన్నారు. డివిజన్ పరిధిలో కుక్కల తరలింపును పరిశీలించారు.

## బస్టాండ్ పనులు మరిచారా?

*బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్*

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 30: చారిత్రక వరంగల్‌కు బస్టాండ్ కరువైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో వరంగల్ బస్టాండ్ ఆవరణలో వరంగల్ ఆత్మగౌరవం పేరుతో చేపట్టిన మహా ధర్నాలో ఆయన మాట్లాడారు. వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులపై కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక మంత్రి సంవత్సర కాలంగా పట్టించుకోవడంలేదన్నారు. రోడ్డుపై తాత్కాలిక బస్టాండ్‌గా మార్చగా ప్రయాణీకులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రదీప్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనకబాటుకు గురైందన్నారు. మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీ అజ్మీరా, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, గురుమూర్తి, శివ, వన్నాల వెంకటరమణ, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు వంగాల సమ్మిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, రాణా ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్ పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి

దుగ్గొండి/నర్సంపేట, డిసెంబర్ 30: ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ పిలుపునిచ్చారు. సోమవారం గిర్నిబావిలో మండల ప్రధాన కార్యదర్శి జెట్టబోయిన రాజేందర్ అధ్యక్షతన మెపా ముఖ్య కార్యకర్తల సమావేశం సమావేశం నిర్వహించారు. మెపా మండల ఉపాధ్యక్షుడిగా చాపలబండకు చెందిన సంకెళ్ల స్వామి, రేకంపల్లికి చెందిన నీరటి రాజు ప్రచార కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు వివరించారు. మెపా రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, పెండ్యాల కమల్‌హసన్, బుసాని రమేశ్, ఓరుగంటి కుమారస్వామి, జెట్టబోయిన రాజు, నవీన్ పాల్గొన్నారు. కాగా, నర్సంపేట మండలం రామవరానికి చెందిన కోరబోయిన కుమారస్వామి-రమ దంపతుల కూతురు సుష్మ ముదిరాజ్ గ్రూప్-4 ఫలితాల్లో ఉత్తమ ర్యాంక్ సాధించి ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందింది. ఈమేరకు మెపా ఆధ్వర్యంలో సుష్మను ఘనంగా సన్మానించారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి

వడ్ల తేమ పరిశీలిస్తున్న రామస్వామినాయక్

ఖానాపురం, డిసెంబర్ 30: ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని ఓడీసీ ఎంఎస్ చైర్మన్ రామస్వామి నాయక్ అన్నారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ డైరెక్టర్లతో కలిసి ఓడీసీఎంఎస్ చైర్మన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 2,20,500 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. వైస్ చైర్మన్ దేవినేని వేణుకృష్ణ, డైరెక్టర్లు నీలం సాంబయ్య, అన్నమనేని రవీందర్‌రావు, సునీత, భాగ్యమ్మ, కుమారస్వామి, తిరుపతి, లక్ష్మణ్, సీఈఓ ఆంజనేయులు, రాజు పాల్గొన్నారు.

## స్